క్లుప్తంగా

కొనసాగుతున్న యూరియా కష్టాలు



నేరడి-బీ ఆర్‌బీసీ దగ్గర రైతుల అవస్థలు

భామిని: మండలంలో రైతులకు అవసరమైన యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. ఎకరానికి ప్రభుత్వం ఇచ్చే ఒక యూరియా బస్తా కోసం రోజంతా నిరీక్షిస్తున్నారు. నేరడి బి, ఘనసర, పెద్దదిమిలి, సింగిడి కేంద్రాల వద్ద వందలాది మంది రైతులు యూరియా కోసం అవస్థలు పడ్డారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

జియ్యమ్మవలస: జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బోను వాసు ప్రతిభ చాటాడు. ఐఈసీ రెడ్‌రిబ్బన్ 2025–26 క్విజ్ పోటీల్లో సదరు విద్యార్థి తనదైన ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. ఈ మేరకు విజేతగా నిలిచిన విద్యార్థికి రూ.5 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ మేరకు అతడిని కళాశాల ప్రిన్సిపాల్ రవణ తదితరులు అభినందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా అర్జునరావు

గరుగుబిల్లి: మక్కువ మండల ఎంపీడీవోగా ఎస్.అర్జునరావు నియమితులయ్యారు. ఈ మేరకు జెడ్పీ సీఈవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో స్వరూపరాణి సెలవుపై వెళ్లడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

నానో యూరియా వాడాలి

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా గుళికల రూపంలోని యూరియా బదులుగా ద్రవరూపంలోని నానో యూరియాను వాడాలని ఏవో పి.శంకరరావు సూచించారు. మండలంలోని లుంబేసు, ఇరిడి రైతు సేవా కేంద్రాల వద్ద మండల ప్రత్యేకాధికారి కనకదుర్గ ఆధ్వర్యంలో యూరియా అవుట్ రీచ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుళికల రూపంలో ఉన్న యూరియాను పంటలో వేయడం వల్ల50 శాతం మాత్రమే పంటకు అందుతుందని, మిగతా 50 శాతం భూమిలోనో.. గాలిలోనో ఆవిరైపోతుందన్నారు. అదే ద్రవరూపంలోని నానో యూరియా వేసుకుంటే పంటకు శతశాతం అందుతుందని తద్వారా పంట బాగా పండుతుందన్నారు. ఎకరంలోని వరి పంటకు అరలీటరు నానో యూరియా చొప్పున వేసుకుంటే సరిపోతుందన్నారు. అనంతరం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తహసీల్దారు ఎన్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు మండల కమిటీ

భామిని: పాలకొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో భామిని మండలాన్ని సారా రహిత మండలంగా తీర్చిదిద్దడానికి మండల స్థాయి అధికారులతో మంగళవారం కమిటీ వేసి సమావేశం నిర్వహించారు. నవోదయం 2.0లో భాగంగా సారా రహిత మండలంగా మార్చడానికి చైర్‌పర్సన్‌గా ఎంపీపీ తోట శాంతికుమారి, కన్వీనర్‌గా ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి, తహసీల్దార్ శివన్నారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, బత్తిలి ఎస్‌ఐ జి.అప్పారావులు సభ్యులుగా పనిచేసి మండలాన్ని సారా రహితంగా తీర్చిదిద్దడానికి నిర్ణయించినట్లు సీఐ సూర్యకుమారి తెలిపారు.మండలంలో 8 గ్రామాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి సారా రహితంగా చేయడానికి యాక్షన్ ప్లాన్‌పై కమిటీ చర్చించిందని గుర్తించిన గ్రామానికి దత్తత అధికారిని నియమించినట్టు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు రిసోర్స్‌పర్సన్లు అందుబాటులో ఉండాలని రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్ ప్రవీన్ కుమార్ సూచించారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలకు చెందిన సహజ వనరుల కేంద్రం యజమానులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన కాసేపు మాట్లాడారు. బయో రిసోర్స్ కేంద్రాల్లో రైతులకు అవసరమైన కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంచితే నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ కషాయాలు, ద్రావణాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఏ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయం వద్ద గర్భిణులకు మంగళవారం అన్నదానం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నెలవారీ తనిఖీల నిమిత్తం విచ్చేసిన గర్భిణులకు సాయి భక్తులు పౌష్టికాహారం అందజేశారు. మండలంలోని బురద వెంకటాపురానికి చెందిన బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు ఈ ఆహారం ఏర్పాటు చేశారు.

25 గ్రామాల్లో స్వమిత్వ సర్వే

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని 25 గ్రామాల్లో స్వమిత్వ సర్వే చేపడుతున్నట్లు పంచాయతీ ప్రత్యేకాధికారి టి.కొండలరావు మంగళవారం తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటికి సర్వహక్కులు కల్పిస్తూ హక్కు పత్రం జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఈ సర్వే నిర్వహణ బాధ్యతలు సచివాలయ సిబ్బందికి అప్పగించడం జరిగిందన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



కొమరాడ: శివిని వద్ద పార్వతీపురం వెళ్లనీయకుండా వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న ఎస్‌ఐ నీలకంఠం



గరుగుబిల్లి: ఉల్లిభద్ర జంక్షన్ నుంచి రైతుపోరుకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



జియ్యమ్మవలస రూరల్: అన్నదాత పోరుకు వెళ్లకుండా చినమేరంగిలో మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిని అడ్డుకుంటున్న పోలీసులు

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- యూరియా అడిగితే కేసులు పెడుతున్నారు..
- వ్యవసాయం దండగగా మార్చడమే చంద్రబాబు లక్ష్యం
- రైతు పోరుకు అడుగడుగునా పోలీసుల ఆంక్షలు
- అన్నదాతకు అండగా ఉంటాం..: విక్రాంత్, కళావతి, పుష్పశ్రీవాణి



అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ/పాలకొండ రూరల్: 'ఒక్క యూరియా బస్తా కోసం రైతులు పాట్లు పడుతున్నారు.. రోజుల తరబడి ఎండలో క్యూ కడుతున్నారు.. వేసిన పంటను కాపాడుకోవడానికి కష్టాలు పడుతున్నారు.. ఇవేవీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కనిపించడంలేదు.. ఎక్కడా యూరియా కొరత లేదంటారు.. యూరియా అడిగిన వారు రైతులే కాదంటారు.. యూరియా అడిగితే కేసులు పెట్టి బొక్కలో వేస్తామని బెదిరిస్తున్నారు.. ఇదేం ప్రభుత్వం.. ఇంతవరకు ఇంతటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని చూడలేదు..' అని వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ మంగళవారం చేపట్టిన యూరియాపై రైతు పోరు కార్యక్రమంలో వీరు మాట్లాడారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం చేపడుతున్న వివక్షతను ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు అవస్థలు పడుతుంటే యూరియా కొరత లేదని ప్రకటనలు చేయడం, యూరియా అడిగితే కేసులు పెడతామని చంద్రబాబు నాయుడు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా అడిగిన వారు రైతులు కాదని వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులని కూటమి నాయకులు మాట్లాడడం విచిత్రంగా ఉందన్నారు. రైతుల సమస్యను పూర్తిగా వదిలేసి వ్యవసాయ రంగాన్ని నాశనం చేయడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ తోటపల్లి ఆధునికీకరణ పనులు నిలిపివేస్తున్నట్టు జీవో జారీ చేశారని తెలిపారు.

ఫలించని ఆంక్షలు

రైతు పోరు కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకునేందుకు అన్ని విధాల ప్రయత్నించింది. పోలీసు బలగాలను దించి ఎక్కడికక్కడే బారికేడ్‌లు ఏర్పాటు చేసింది. వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య నాయకులను ఇంటి వద్దనే అరెస్టు చేయించింది. డివిజన్ కేంద్రానికి రాకుండా నాలుగు రహదారుల్లోను పోలీసులను మోహరించింది. ఇంత చేసినా రైతు పోరును మాత్రం ఆపలేకపోయింది. పోలీసులు కేవలం 10 మంది మాత్రమే ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. వీటిని లెక్కచేయని రైతులు వందలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్సీ విక్రాంత్ నివాస గృహానికి చేరుకుని అక్కడ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కూడా పోలీసులు గేట్లు వేసి అడ్డుకున్నారు. పలు ఆటంకాల మధ్య సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సావిత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం వీరు రైతుల పట్ల ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు యూరియా అందించిన వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నాయకులను ఆపినా..కార్యక్రమం ఆపలేరు..

జియ్యమ్మవలస రూరల్: రైతు సమస్యలపై వైఎస్సార్ సీపీ చేస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లనీయకుండా నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టలతో ఆపవచ్చేమో గానీ కార్యక్రమం జరగడాన్ని మాత్రం ఎవరూ ఆపలేరని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి అన్నారు. అన్నదాత పోరు కార్యక్రమానికి పాలకొండ ఆర్డీవో కార్యాలయానికి వెళ్తున్న ఆమెను పోలీసులు చినమేరంగిలోని ఆమె నివాసం వద్దే అడ్డుకున్నారు. కొంత వాగ్వాదం జరిగిన అనంతరం షరతులతో కూడిన అనుమతులు ఇవ్వడంతో కార్యక్రమానికి పుష్పశ్రీవాణి హాజరై, రైతు యూరియా సమస్యపై గొంతెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆకలి తీర్చే అన్నదాతపై ఎందుకింత కక్ష? వారి పట్ల చిత్తుశుద్ధి ఉంటే వారికి అవసరమైన యూరియా అందించాలన్నారు.

కొమరాడ: ఎరువుల బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు బాసటగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్వతీపురం ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కూటమి సర్కారు డైరెక్షన్ మేరకు ఎక్కడికక్కడ నాయకులను హౌస్ అరెస్ట్(గృహ నిర్బంధం) చేసి, కార్యక్రమానికి వెళ్లకుండా చేశారు. ఈ నేపథ్యంలో గృహ నిర్బంధానికి గురైన నేతలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత సమస్యపై ప్రశ్నించేందుకు సిద్ధమైతే ప్రభుత్వం ఇలా నిర్బంధించడం ఏమాత్రం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలి కానీ అన్నదాతల తరఫున ప్రశ్నించే గొంతును నొక్కేయకూడదన్నారు. కొమరాడలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు, మరో నాయకుడు మరడాన సింహాచలం, రాజ్యలక్ష్మీపురంలో వైస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబులు హౌస్ అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

గరుగుబిల్లి: రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్వతీపురంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్దఎత్తున బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు బాసటగా నిలుస్తూ వారికి సకాలంలో యూరియా అందించి, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే కార్యక్రమానికి వెళ్తున్న వారిని ఉల్లిభద్ర జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారిరువురి మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అన్నదాతకు అండగా నిలవడానికి వెళ్తున్న తమను అడ్డుకోవడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అచ్యుతరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, పోలీసులతో రైతు ఉద్యమాన్ని ఆపలేరన్నారు. నిర్బంధానికి గురైన వారిలో మండలంలోని రావివలస, లఖనాపురం, తోటపల్లి, సంతోషపురం, నాగూరు, చిలకాం, గరుగుబిల్లి, రావుపల్లి, ఉల్లిభద్ర, గిజబ, కొత్తపల్లి, గొంట్లివలస తదితర గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

అడుగడుగునా అడ్డంకులు

సీతంపేట: అన్నదాత పోరు కార్యక్రమానికి పాలకొండ ఆర్డీవో కార్యాలయానికి వెళ్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే మంగళవారం అడ్డుకున్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణను తన స్వగ్రామమైన మానాపురంలో దోనుబాయి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కుశిమి వద్ద అన్నదాత పోరుకు వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఎస్‌ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు.

అధికారులను నిలదీసిన రైతులు

భామిని: మండలంలోని యూరియా పంపిణీని పర్యవేక్షించిన మండల అధికారులను రైతులు మంగళవారం నిలదీశారు. ఏఈవో కొల్లి తిలక్, తహసీల్దార్ శివన్నారాయణ, ఎంఆర్‌ఐ మణి ప్రభాకర్‌ను రైతుల ఎరువుల కొరతపై ప్రశ్నించారు. పెద్దదిమిలి రైతు సేవా కేంద్రం వద్ద సతివాడ, పోలీస్‌కోట రైతులు యూరియా అందడం లేదని నిలదీశారు. రెండో విడతలో వచ్చే ఎరువులను ఆయా గ్రామాలకు కేటాయిస్తామని అధికారులు నచ్చజెప్పారు. వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు పర్యవేక్షించారు.



కొమరాడ: విక్రంపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్వరరావును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో హౌస్ అరెస్టయిన వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు శరత్‌బాబు



సీతంపేట: మానాపురంలో ఎంపీపీ ఆదినారాయణను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



సీతంపేట: కుశిమి వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకున్న ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు



వీరఘట్టంలో మార్కెట్ యార్డ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌లో దమ్ములు ముగిసి నెల రోజులు అవుతున్నా తమకు ఒక్క బస్తా యూరియా కూడా దొరకడం లేదని, వీరఘట్టం మన గ్రోమోర్‌లో ఉన్న 400 బస్తాల యూరియాను సిఫార్సులు ఉన్న వారికే అందజేస్తున్నారని వ్యవసాయ శాఖాధికారులపై రైతులు మండిపడ్డారు. మంగళవారం ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా సీఎస్‌పీ రహదారిపై ఆందోళన చేపట్టారు. యూరియా కావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్రమంగా తరలిపోతున్న యూరియాకు అడ్డుకట్ట వేసి నిజమైన రైతులకు యూరియా అందజేయాలని నినదించారు. దీంతో ప్రధాన రహదారిలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ కళాధర్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు వస్తారు, వారితో మాట్లాడి యూరియా ఇప్పిస్తామని ఎస్‌ఐ తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం అక్కడికి వచ్చిన ఏడీఏ రత్నకుమారి, ఏవో సౌజన్య, మండల ప్రత్యేకాధికారిణి కృష్ణవేణిలు రైతులతో మాట్లాడారు. అందరికీ యూరియా పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రైతులు సహకరించాలని కోరారు. దీంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు



ఫైలేరియా నిర్ధారణ పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి మణి

కొమరాడ: మండలంలోని పాడుగువలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఫైలేరియా(బోదకాలు) వ్యాధి నిర్ధారణ పరీక్షలు మంగళవారం చేశారు. బోదకాలు వ్యాధి నివారణకు జిల్లాలోని 102 గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో ఫైలేరియా సర్వే చేసి, వ్యాధిగ్రస్తులను గుర్తించే పని చేపడుతున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి మణి తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని చంద్రపేట, మార్కొండపుట్టి, అంకుళ్లవలస, బొడ్డవలస, పాడుగువలస, శివిని, జొప్పంగి, కొత్తవలస, శ్రీసాయి విద్యానికేతన్, గుడ్డాం గ్రామాల్లో సర్వే చేస్తున్నామన్నారు. అనంతరం కేఆర్‌బీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందుల నిల్వలు, ల్యాబ్‌ల పనితీరుపై ఆరాతీశారు. ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ సహాయ అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్యకుమారి

పాలకొండ: సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి కోరారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సారా నిర్మూలన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీలో తహసీల్దార్, ఎస్‌ఐ, ఎంపీడీవో, ఎంపీపీలు ఉంటారని తెలిపారు. పాలకొండ మండలాన్ని సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేశామని తెలిపారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా గ్రామాల్లో సారా నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సారా తీవ్రతను బట్టి గ్రామాలకు ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలోను సారా లేకుండా ఉండేందుకు ప్రజలు సహకారం అందించాలని కోరారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ నాగభూషణరావు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డీసీహెచ్ఎస్ జి.నాగభూషణరావు హాజరై కాసేపు మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తున్నామని, రోగులకు అవసరమైన సేవలు సక్రమంగా అందిస్తున్నామన్నారు. అనంతరం ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి పనులు, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రతపై చర్చించారు. అనంతరం ఆస్పత్రి శుభ్రత, ప్రహరీ, విద్యుత్ దీపాల ఏర్పాటుకు తీర్మానం చేశారు.

ఎస్‌జీఎఫ్ ఎంపికలు రేపు

సీతంపేట: ఈ నెల 11న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఎంపికలు నిర్వహించనున్నట్టు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానందం తెలిపారు. స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలన్నీ మొత్తం 18 విద్యా సంస్థల నుంచి విద్యార్థులు హాజరౌతారన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు జరగనున్నాయన్నారు.

ఆలయ నిర్మాణానికి చిన్నారుల సాయం



మర్రిపాడు నుంచి పూతికవలసకు నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటలో నిర్మిస్తున్న రామాలయానికి అదే వీధికి చెందిన చిన్నారులు సాయమందించారు. బాలగణేష్ యూత్ పేరిట చందాలు ఎత్తుకుని మరీ రూ.3,500లను మందిరం నిర్మాణ పనులకు అందజేశారు. ఈ మేరకు చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

'ఆది కర్మయోగి'పై అవగాహన ర్యాలీ



కుంబిడి గ్రామంలో పర్యటిస్తున్న ఆదికర్మయోగి బృందం సభ్యులు



చినఖేర్జిలో జరిగిన ర్యాలీలో ఎంపీడీవో రమేష్, తదితరులు

కొమరాడ: కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆది కర్మయోగిపై అవగాహన కల్పిస్తూ మండలంలోని చినఖేర్జిల, బట్టిమాగువలస గ్రామాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామసభల్లో ఎంపీడీవో ఎస్.రమేష్ పాల్గొని, పథకం గూర్చి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, కాలువలు, శ్మశానవాటికలు, పక్కా ఇళ్లు ఉండేలా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆదికర్మయోగితో సత్ఫలితాలు

వీరఘట్టం: ఆదికర్మయోగితో గిరిజన గ్రామాల్లో సత్ఫలితాలు వస్తాయని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మండలంలోని కుంబిడి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ గౌరినాయుడుతో మాట్లాడి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలన్నింటిని అధికారుల బృందం నమోదు చేసుకున్నారు.

ఘనంగా పైడిమారమ్మ వారాల పండగ



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కురుపాం: మండల కేంద్రంలో పైడిమారమ్మ వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా వనంగుడికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు

కురుపాం: విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఫ్రెషర్స్ డే..కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన..ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడేందుకు ఓ లక్ష్యం పెట్టుకుని, దాని సాధన దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఒక్క చదువే కాకుండా అన్నింటా ముందుండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చినమేరంగి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రవణ పాల్గొన్నారు.